క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి విరాళం



అర్చకులకు నగదు అందజేస్తున్నదాత ఉమాపతిస్వామి కుటుంబ సభ్యులు

బనగానపల్లెరూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి, నిత్యాన్నదాన సంస్థకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఉమాపతి స్వామి ఆయన కుమారుడు సత్యనారాయణస్వామి రూ.లక్ష విరాళాన్ని ఆలయ అర్చకులు రామకృష్ణ శర్మకు మంగళవారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి రూ.75 వేలు, నిత్యన్నదాన సంస్థకు రూ.25 వేలు ప్రకారం విరాళం అందజేసినట్లు అర్చకులు తెలిపారు. దాతలను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో పీర్లకు ఫాతెహాలు



బాదుల్లాస్వామి పీరుకు ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని సౌదరదిన్నె గ్రామంలో పీర్లపండుగ 40 పూర్తి అయిన సందర్భంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. ఆయా చావిళ్లలోని బాదుల్లా, బార్ఇమాం పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివార్లకు ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చావిళ్ల ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సేవాభావం అలవర్చుకోవాలి



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వినియోగించాలని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ నరసింహారెడ్డి చెప్పారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను మంగళవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి నెలా పేదలకు తమవంతు సాయంగా పింఛన్లు అందజే స్తున్నామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం నారాయణ స్వామి, మాజీ సైనిక ఉద్యోగి సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని పలుకూరు ఎస్సీ కాలనీలో రూ.15లక్షల డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అవసరం ఉన్న ప్రాంతాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లె సురేష్‌రెడ్డి, మండ్లభూపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు సుబ్రహ్మణ్యం, బాలస్వామి, వెంకటేష్, బాలమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : కర్నూలులోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 3వ తేదీన జరిగిన 11వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో డోన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనభరచి పతకాలు సాధించారు. శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు వైశాలీ, రిషీ, చరణ్, నిఖిల్, అభిరామ్, తరుణ్ బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ ఉమా, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



కైప జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు



సర్వేపల్లి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సర్వేపల్లి అడుగు జాడల్లో నడవాలి

- ఘనంగా గురుపూజోత్సవం

కోవెలకుంట్ల: దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ అడుగు జాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. సర్వేపల్లి జయంతిని పురష్కరించుకుని మంగళవారం బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రాజయ్య, గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సర్వేపల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, రాజశేఖర్, కృష్ణదాసు, రాజు, భాస్కర్‌నాయుడు, పుల్లయ్య, కృష్ణయ్య, న రేంద్రనాథరెడ్డి, అన్నపూర్ణ, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆయా పాఠశాల హెచ్ఎంల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కైప గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, రఘునాథ్, చంద్రశేఖర్‌రెడ్డి తదతరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జానకి ఆధ్వర్యంలో సర్వేపల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి చిరు కానుకలు అందజేశారు.



మెమొంటోలతో ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

కొలిమిగుండ్ల: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాముడు, గుర్రప్ప, చారిస్ ఇజ్రాయిల్, శివలింగారెడ్డి, ప్రశాంతి, సరిత, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మంగళవారం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, హుసేనాపురం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అన్వర్ బాష తదితరులు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.



ఉపాధ్యాయులపై పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

డోన్ టౌన్ : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురష్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి సేవలను ఉపాధ్యాయులు గుర్తు చేశారు. పాతపేట హైస్కూల్లో హెచ్ఎం పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయులపై పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కేక్ కట్ చేయించి సంబరాలు చేసుకున్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు విద్యార్థులు బహుమతులు సమర్పించారు. అనంతర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి

బేతంచెర్ల: ప్రాచీన కాలంనుండి నేటి వరకు విద్యాబుద్ధుల నేర్పే ఉపాధ్యాయ వృత్తి సమాజంలో పరమ పవిత్రమైనదని డోన్ ఆర్డీఓ వెంకట రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, డీటీ సత్యదీప్ ఆధ్వర్యంలో సర్వే పల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీఓ, తహసీల్దార్‌ను రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. గోరుమానుకొండ మోడల్ స్కూల్లో గ్రామ ప్రిన్సిపాల్ గంగుల నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, రామనాయుడు సర్వేపల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ సోమశేఖర్‌ను ఎంపీడీఓ వెంగన్న సిబ్బంది, ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈఓ -2 జనార్దన్ గౌడు మండల ప్రైవేటు స్కూలు అసోషియేషన్ సభ్యులు సత్కరించారు.

రిటైర్డు ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

డోన్ టౌన్ : స్థానిక పెన్షనర్ల భవనంలో 75 సంవత్సరాలు పూర్తయిన రిటైర్డు ఉపాధ్యాయులను మంగళవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించారు. సుబ్బరాయుడు, ఆంజనేయులు, సుధాకర్, చంద్రశేఖర్, శంకరయ్య, మదన్‌గోపాల్ తదితరులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.



ప్యాపిలిలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం



బేతంచెర్లలో ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



గోర్లగుట్ట గ్రామంలో....



ఆర్డీఓ వెంకటరెడ్డిని సత్కరిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

డోన్ టౌన్ : అర్హత ఉన్న ప్రతి వ్యక్తికీ ఓటు హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని డోన్ నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి మనోహర్(ఆర్‌డబ్ల్యూస్ ఎస్‌ఈ నంద్యాల)అన్నారు. పట్టణంలో తొలగించిన ఓటర్ల వివరాలను మంగళవారం ఆయన డోన్ తహసీల్దార్ విద్యా సాగర్‌తో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 06-01-2022 నుంచి 31-03-2023 వరకు తొలగించిన ఓటర్ల జాబితాను పున: పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలోని 102 మరియు 104 పోలింగ్ బూత్ పరిధిలో తొలగించిన ఓటర్ల వివరాలను ఇంటింటికి వెళ్లి విచారణ చేశారు. ఒకే వ్యక్తికి పలు చోట్ల ఓటు హక్కు ఉండడం, శాశ్వత వలసులుగా వెళ్లడం, మృతి చెందిన ఓట్లు తొలగించడం జరిగిందని, వీటిని మళ్లీ పరిశీలించామని చెప్పారు.



ఓటర్లను విచారిస్తున్న ప్రత్యేక అధికారి మనోహర్, డోన్ తహసీల్దార్ విద్యాసాగర్

నేడు కృష్ణాష్టమి వేడుకలు



కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం ప్రధాన రహదారి పక్కలోని శ్రీకృష్ణ మందిరంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, గీతాపారాయణం, గ్రామోత్సవం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఉట్టికొట్టు కార్యక్రమం, కోలాట ప్రదర్శన, విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఉంటాయని గీతామందిరం కమిటీ సభ్యులు తెలిపారు. బెలుం, బెలుం శింగవరం, కొలిమిగుండ్ల,పెట్నికోట, సంగపట్నం గ్రామాలకు చెందిన భజన బృందాల సభ్యులు హరినామ సంకీర్తనలు ఆలపిస్తారని చెప్పారు.

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో ప్రబోధ సేవా సమితి- ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా స్థానిక స్టేట్‌బ్యాంక్ రోడ్‌లో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి మండపంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ నెల 14వ తేదీన విగ్రహ ఊరేగింపుతో వేడుకలు ముగుస్తాయి.

డోన్ టౌన్ : శ్రీకృష్ణా జన్మాష్టమి పురష్కరించుకోని బుధవారం పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6గంటల నుంచి వేడుకలు ప్రారంభంవుతాయని, ఉట్టి కోట్టే కార్యక్రమంతో పాటు అస్టోత్తర శతనామావళి పూజ, మహా మంగళ హారతులు, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అనుగ్రహం పోందాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ పాణ్యం సిమెంట్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం ఘనంగా జరిగింది. 1985, 86లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు దాదాపు 39 ఏళ్లతర్వాత ఒకేవేదికపై చేరారు. యాకోబ్, వంశీ, మౌలా బాషా, ఉమా శంకర్, శేర్షా, నీలకంఠం, కళ్యాణి, ఏగ్బాల్, శోభరాణి, కాంతామణి, భానుమూర్తి, రామ్, తిరుమలేష్, నాగరాజు, చంద్రశేఖర్ రాజు, విజయలక్ష్మి, వరలక్ష్మి తదితర పూర్వవిద్యార్థులు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో కలిసి పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా సర్వే పల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు సుబ్బారావు, సుధాకర్ శర్మ, గోవింద ప్రసాద్, రామసుబ్బయ్య, దేవమణి, వెంకటస్వామి, సూరిబాబు, నాగమణి, వీరనారాయణ, నిర్మలకు మారిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

భగవద్గీత శ్లోకాలపై పోటీ పరీక్ష



బహుమతులను సమితి సభ్యులు

అవుకు: త్రైత సిద్ధాంత ప్రబోధా సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని రామాపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీ పరీక్షలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు, ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం శ్రీ కృష్ణ తత్వం, భగవద్గీత ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక తాడిపత్రి కమిటీ అధ్యక్షుడు బాలయ్య, ఉపాధ్యాయులు చౌడయ్య, హుస్సేన్‌బీ, వజీరునిసా, మద్దిలేటి, మస్తాన్ పాల్గొన్నారు.

భ్రూణ హత్యల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న మమ్మద్ రఫీ

డోన్ టౌన్: సమాజంలో భ్రూణ హత్యల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని గర్భస్థ పిండ పరీక్ష నివారణ కమిటీ సభ్యులు మమ్మద్ రఫీ అన్నారు. మంగళవారం మదర్ థెరిస్సా వర్ధంతి, డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ జయంతి పురష్కరించుకొని పట్టణంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో భ్రూణ హత్యల నివారణపై అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ వివక్ష రూపుమాపడానికి భ్రూణ హత్యల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ లోక్‌నాథరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- జడ్జి తంగమణి

డోన్ రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని డోన్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం సీడీపీఓ శంషాద్ బేగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల అనర్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు జడ్జి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని తెలిపారు. సరైన అవగాహనలేనందునే ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాల్య వివహల మూలంగా జరిగే అనర్థాలపై గ్రామాల్లో తల్లి, తండ్రులకు సమావేశాలు నిర్వహించి చైతన్య పరచాలని సూచించారు. మహిళల రక్షణకు చట్టాలు ఉన్నాయని, ఏదైనా సమస్య వస్తే మహిళా పోలీలను సంప్రదించాలని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో లీగల్ న్యాయవ్యాది శ్రీలతాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సైపర్‌వైజర్లు పరమేశ్వరి, అరుణ, దేవకృప, సుగనమ్మ, తిప్పమ్మ, శకుంతల, పద్మా తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

మంగంపేటలో రోడ్డు ప్రమాదం

- బేతంచెర్లకు చెందిన రామ్ పుల్లయ్య మృతి

ఓబులవారిపల్లె : కడప జిల్లా ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేట జాతీయ రహదారిపై మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నంద్యాల జిల్లా బేతంచెర్ల గ్రామానికి చెందిన రామ్‌పుల్లయ్య (48 మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామ్ పుల్లయ్య పదేళ్లుగా మంగంపేటలో నివాసం ఉంటూ క్రస్సర్‌లో పని చేస్తున్నాడు. రామ్ పుల్లయ్య, ఆయన భార్య నాగరాణి పనులు ముగించుకొని మంగంపేటలోని తమ ఇంటికి జాతీయ రహదారిపై కాలినడకన వెళ్తున్నారు. మంగంపేట డౌన్ వద్ద గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి వారిని ఢీకొంది. దీంతో రామ్ పుల్లయ్యకు తీవ్రంగా, నాగరాణికి స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామ్ పుల్లయ్య మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.



మృతి చెందిన రామ్ పుల్లయ్య

అక్రమ కేసులు ఎత్తివేయాలి

బేతంచెర్ల: హర్యానాలో ఆశా కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టినటువంటి అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి, సీఐటీయూ మండల కార్యదర్శి రహంతుల్లా కోరారు. మంగళవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా వర్కర్స్ యూనియన్ మండల నాయకురాలు పుష్పావతి అధ్యక్షతన నల్ల బ్యాడ్జీల ధరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ హర్యానా రాష్ట్రంలో ఆశా కార్యకర్తలను రెగ్యులర్ చేయాలని, నెలకు రూ.26 వేలు ఇవ్వాలని శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా లాఠీచార్జీ చేసి గాయాలు పరచడం బాధాకరమన్నారు.



ముక్కమల్ల గ్రామంలో పచ్చగా వరి పంట




సంజామలలో ప్రాణం పోసుకున్న మొక్కజొన్న

పంటలు కళకళ!

సంజామల: వరుణడు కరుణించడంతో పంటలు కళకళలాడుతున్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు వర్షాలు కురువక వాడుపట్టాయి. దీంతో రైతులు నిరాశకు గురయ్యారు. అయితే మూడురోజుల కిందట వరుణదేవుడు జాలీ చూపాడు. ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. బెట్టపోయిన పైరుకు జీవం పోశాడు వరుణుడు. ఇక వర్షం తాకిడి కొనసాగుతూనే ఉంది. పైర్లు వర్షం నీటితో నిండిపోయాయి. ప్రధాన రోడ్లు జలమయం అయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అక్కడక్కడ వాగులు పొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలో వరి-607 హెక్టార్లు, మిరుప -873 హెక్టార్లు, మొక్కజొన్న-394 హెక్టార్లు, పత్తి -222 హెక్టార్లు, మినుము-100 హెక్టార్లు, కంది-89 హెక్టార్లలలో సాగు చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైర్లు కళకళలాడుతున్నాయి. వర్షాలు అనుకూలం కావడంతో వరి, మిరుప నాట్లు వేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు.

ఊపందుకున్న మిరప సాగు



సౌరదిన్నెలో మిరపనాట్లు వేస్తున్న కూలీలు

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో నాలుగు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో మిరపనాట్లు ఊపందుకున్నాయి. మంగళవారం సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ ఏడాది 9,604 హెక్టార్లలో మిరప సాగు కావాల్సి ఉంది. వర్షాలు అనుకూలంగా మారడంతో ఆయా మండలాల పరిధిలో మిరప నాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. అదునుకు వర్షాలు కురియడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకావం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

పెరిగిన ఆలయ ఆదాయం

బనగానపల్లెరూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో భక్తుల సౌకర్యార్థం పండ్లు, బొమ్మల అంగడి, ఐస్‌క్రీము అమ్ముకునే హక్కు నిమిత్తం మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయానికి ఆదాయం పెరిగిందని కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పండ్లు, బొమ్మల అంగడిని బి మహేంద్రనాథ్‌రెడ్డి అనే పాటదారుడు అత్యధికంగా రూ.6.40లక్షలకు దక్కించుకున్నారన్నారు. అదేవిధంగా ఐస్‌క్రీం అమ్మకం హక్కును కె.కిశోర్‌కుమార్ అత్యధికంగా రూ.2.50లక్షలకు పాడి దక్కించుకున్నారు. గతేడాదికంటే రూ.20వేల ఆదాయం పెరిగిందని ఈఓ తెలిపారు. టెంకాయల విక్రయానికి బహిరంగ వేలంలో సరైన ధర పాటదారుల నుంచి రాకపోవడంతో ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి హరిచంద్రారెడ్డి, చైర్మన్ తోటబుచ్చి రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.